



# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)





Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 245 | శనివారం 06- సెప్టెంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తెలంగాణ అడుగులు: డిప్యూటీ సీఎం భట్టి



న్యూస్ డెస్క్ , 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) : మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తెలంగాణ రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లో మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.

## ముఖ్యమంత్రి మాటలు రైతులను మరింత రెచ్చగొట్టేలా ఉన్నాయి : ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

న్యూస్ డెస్క్ , 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాటలు రైతులను మరింత రెచ్చగొట్టేలా ఉన్నాయని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క రంగం సరిగా లేదు.. సీఎం సమీక్షలు నిర్వహించడమే మరిచాడు అని మండిపడ్డారు.







# ధరణి దరిద్రాన్ని భూభారతితో తొలగించాం

- భూమి కోసం సాగిన తెలంగాణ పోరాటాల గాథను గుర్తు చేసిన సీఎం
- జీపీవోలకు నియామక పత్రాల పంపిణీతో గ్రామ స్థాయిలో భూ పరిపాలనకు బలం
- ధరణి వల్లే ప్రజలకు భూ సమస్యలు వచ్చాయన్న సీఎం విమర్శలు
- వీఆర్‌వో, వీఆర్ఏల తొలగింపు దురుద్దేశపూరితమన్న ఆరోపణలు
- భూభారతి చట్టం ద్వారా పేదవాడి భూమికి భద్రత కల్పిస్తాం: మంత్రి పొంగులేటి
- "డిసెంబర్ చివరిలో భూభారతి రికార్డులు ప్రజల ముందుంచుతాం: రెవెన్యూశాఖ ప్రకటన

## తెలంగాణకు నూతన విద్యా విధానం కావాలి

**: సీఎం రేవంత్‌రెడ్డి**

న్యూస్ డెస్క్ , 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) : శిల్పకళా వేదికలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకలో ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా మంది ముఖ్యమంత్రులు ఫైనాన్స్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలను తమ దగ్గర పెట్టుకుంటారు. కానీ తాను విద్యాశాఖను తన దగ్గర పెట్టుకున్నట్లు తెలిపారు. అత్యంత వివాదాస్పద శాఖ విద్యా శాఖ.. అది తనకు వద్దని పలువురు చెప్పారు.. కానీ వివాదాస్పదం సంగతి చూద్దామనే తన దగ్గర పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి విద్యాశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమైన శాఖ అని.. అందుకే దానిని తాను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. కొంత మంది అవగాహన రాహిత్యంతో ఈ శాఖకు మంత్రిని పెట్టమని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. 2లో

## నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి..

### ఎట్టి పరిస్థితుల్లో డీజేలకు అనుమతి లేదు..



న్యూస్ డెస్క్ , 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) : నగర పోలీస్ కమిషనర్ సీపీ సీవీ ఆనంద్ రేపు జరగబోయే గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సీపీ ఆనంద్ మాట్లాడుతూ.. "పటిష్టమైన పోలీస్ భద్రత ఏర్పాటు చేశాము.. 40 గంటల పాటు నిమజ్జనం సాగబోతుంది.. నేడు ఒక్క ట్యాంక్ బండ్ లోనే 50 వేల విగ్రహాలు నిమజ్జనం అవుతాయి.. నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేశాము.. నిన్న కూడా ఛత్రినాకలో ఒక ఘటన జరిగింది.. విగ్రహం ఎత్తు ఉండటం వల్ల కరెంట్ వైర్ కు తగలకుండా ఉండేలా సుమారు 6 గంటలు కష్టపడాల్సి వచ్చింది.. ఎట్టి పరిస్థితుల్లో డీజే లకు అనుమతి లేదు.. గత సంవత్సరం డీజే కారణంగా చాలా మంది చనిపోయారు.. డీజే వైబ్రేషన్స్ వల్ల యువకుల ఆరోగ్యం దెబ్బ తింటుంది.. భాగ్య నగర గణేష్ ఉత్సవ సమితి కూడా డీజే వద్దు అంటే ఒప్పుకుంది..

## భూభారతి చట్టం సయమంలో సీఎం రేవంత్ రెడ్డి నిద్రలేని రాత్రులు గడిపారు

### : మంత్రి పొంగులేటి



న్యూస్ డెస్క్ , 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) : అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా భూ భారతి చట్టం తయారు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ధరణి స్థానంలో అద్భుతమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని ఈ చట్టం చేసే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి నిద్రలేని రాత్రులు గడిపారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం హైదరాబాద్ లో జీపీవోలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వం ధరణి చట్టానికి విధివిధానాలు రూపొందించలేదని కానీ మేమొచ్చాక పేదవాడి భూములకు భరోసా ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు.

## ప్రభుత్వ విద్యను రాజకీయాలకు దూరంగా ఉంచాం: మంత్రి లోకేశ్

న్యూస్ డెస్క్ , 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) : గురువులు చూపించిన దారిలో నడవడం వల్లే తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకోగలిగానని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీచర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "పిల్లల జీవితాలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే.



# రాబోయే కాలం బిఆర్ఎస్ పార్టీదే

**- మాజీ ఎంపీ నామ**



హైదరాబాద్ బ్యూరో , 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) : కేసిఆర్, కేటీఆర్ లకు అండగా ఉందాం వారి వెంట నడుద్దామని మాజీ ఎంపీ నామ అన్నారు.కేటీఆర్ మాట్లాడుతూ.... పాలన చేతకాని కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి .సుప్రీంకోర్టు తెలంగాణలో జరిగిన ఫిరాయింపులపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. రాబోయే ఆరు నెలల్లో ఉప ఎన్నికలు వస్తాయి. పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్స్‌వాడలో ఓడిపోవడం ఖాయం. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీం కోర్టుకు వెళ్తాం. పోచారం ఎమ్మెల్యే పదవి పోయేవరకు న్యాయపోరాటం కొనసాగిస్తాం. కేవలం 21 నెలల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. రేవంత్ రెడ్డి పరిపాలనపై దృష్టి పెట్టకుండా కేసీఆర్ పేరును పదే పదే ప్రస్తావిస్తున్నాడు. గత ప్రభుత్వం రూ. 2.80 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేసింది, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 21 నెలల్లోనే రూ. 2.20 లక్షల కోట్ల కంటే ఎక్కువ అప్పు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం చేసిన అప్పుతో ఒక్క సంక్షేమ పథకం లేదా అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదు 2లో



## మూల్యం చెల్లించుకోక తప్పదు..

### కవిత మరో ట్వీట్



న్యూస్ డెస్క్ , 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) : పాలకుల మెప్పుకోసం పోలీసులు ప్రజలను ఇబ్బంది పెడితే మూల్యం చెల్లించుకోక తప్పదనే విషయం గుర్తుంచుకోవాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. యూరియా కొరతపై ప్రశ్నించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన రైతు లక్ష్మణ్ యాదవ్ ఇంటికి పోలీసులు వెళ్లడంపై ఎక్స్ వేదికగా శుక్రవారం కవిత స్పందించారు. యూరియా కొరతపై ప్రశ్నించడమే నేరమా? ఇందిరమ్మ రాజ్యమంటే వేధింపులు, బెదిరింపులా అని నిలదీశారు. ఇందుకు సంబంధించిన వీడియోను షేర్ చేసిన ఎమ్మెల్సీ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమిది అని మండిపడ్డారు.

## ఒకే విమానంలో వెళ్తే కాళ్లు మొక్కినట్టా..?

- సీఎం, హరీశ్ రావు ఒకే విమానంలో వెళ్తే కాళ్లు మొక్కినట్టా ?
- నేను, కవిత ఒకే విమానంలో చాలాసార్లు ప్రయాణించాం.
- అంత మాత్రాన ములాఖత్ అయినట్టా



న్యూస్ డెస్క్ , 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) : ముఖ్యమంత్రి పదవిపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి , నా కాంబినేషన్ సక్సెస్ ఫుల్ గా నడుస్తోందని రేవంత్ రెడ్డి నేతృత్వంలోనే రాబోయే ఎన్నికలకు వెళ్తామన్నారు. ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంత్ రెడ్డే మళ్లీ సీఎం అవుతారని సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం హైదరాబాద్ లో మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలుపుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎక్కడా రాజీపడటం లేదని రాజగోపాల్ రెడ్డి వ్యవహారాన్ని అధిష్టానం చూస్తోందన్నారు. రాజగోపాల్ రెడ్డితో హైకమాండ్ మాట్లాడుతోందని చెప్పారు.

## కేసీఆరే సుప్రీం..

### తుది నిర్ణయం పార్టీదే: హరీశ్‌రావు



న్యూస్ డెస్క్ , 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) : కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణల నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుపై కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌లో మాజీ సీఎం కేసీఆరే సుప్రీం అని స్పష్టం చేశారు. ఎవరి విషయంలోనైనా తుది నిర్ణయం పార్టీదే అంటూ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు.

మాజీ మంత్రి హరీష్ రావు ప్రస్తుతం లండన్‌లో ఉన్నారు. తన కూతురి అడ్మిషన్ కోసం ఆయన లండన్ వెళ్లారు. ఈ సందర్భంగా లండన్‌లో బీఆర్ఎస్ NRI నేతల మీట్ ది గ్రేట్ కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ..'బీఆర్ఎస్‌లో మాజీ సీఎం కేసీఆరే సుప్రీం లీడర్. కలిసి పనిచేయడం, ప్రజలకు సేవ చేయడమే కేసీఆర్ మాకు నేర్పించారు. ఎవరి విషయంలోనైనా నిర్ణయం పార్టీదేనని తెలిపారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపైనా హరీశ్ రావు విమర్శలు చేశారు.

## ఇదేనా నాకిచ్చే గౌరవం?

### టీచర్లపై మంత్రి కోమటిరెడ్డి అసహనం



న్యూస్ డెస్క్ , 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) : ఉపాధ్యాయుల తీరుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా నల్గొండలో నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేసి, బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతుండగా.. టీచర్లు భోజనానికి వెళ్లారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి వారిపై అసహనం వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడుతుండగా టీచర్లు అలా చేయడం ఏం బాలేదన్నారు.

# ఒకే విమానంలో వెళ్తే కాళ్లు మొక్కినట్టా ?

మొదటి పేజీ తరువాయి

10 రోజుల్లో అన్ని కమిటీలు:

రిజర్వేషన్ అంశం తేలాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని, రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానం ఆమోదించాలని గవర్నర్ ను కోరామన్నారు. మా విజ్ఞప్తికి గవర్నర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. త్వరలో గ్రామ, మండల, జిల్లా కమిటీలు ప్రకటించబోతున్నామని 10 రోజుల్లో అన్ని కమిటీలు పూర్తి చేస్తామన్నారు. కమిటీలు లేకపోయినా పార్టీని బలోపేతం చేశామన్న ఆయన పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుల ఎంపిక ఉండబోతున్నదన్నారు. మీనాక్షి నటరాజన్ పాదయాత్ర సక్సెస్ అయిందని, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందనే నమ్మకంతో ఆశావహులు పెరిగారు. కామారెడ్డిలో బహిరంగ సభ ఏర్పాటుకు సీఎం ఆదేశాలతో సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.

ఒక ఫ్లైట్ లో వెళ్తే ములాఖత్ అయినట్టా?:

సీఎం, హరీశ్ రావు ఒకే విమానంలో వెళ్తే కాళ్లు మక్కినట్టా? నేను, కవిత ఒకే విమానంలో చాలాసార్లు ప్రయాణించాం. అంత మాత్రాన ములాఖత్ అయినట్టా అని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులను పార్టీలో చేర్చుకోమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే కక్ష పూరితం అంటారని అందువల్లే కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించామన్నారు. బీజేపీ వాళ్లు సీబీఐ ఎంక్వైరీ అడిగారు కదా, నిజాయితీగా దర్యాప్తు చేయించాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని మా అనుమానం అన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇండ్లలో కార్యకర్తలు జోక్యం చేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.యూరియా విషయంలో కేంద్రం వైఫల్యంతోనే రైతులకు ఇబ్బంది ఏర్పడిందన్నారు.

# ముఖ్యమంత్రి మాటలు రైతులను మరింత రెచ్చగొట్టేలా ఉన్నాయి : ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

హాస్టళ్లలో పరిస్థితి దయనీయంగా ఉంది. విద్యార్థులకు హాస్టల్ వార్డెన్లు తమ సొంత ఖర్చులతో భోజనం పెట్టించే పరిస్థితి నెలకొంది. కోడిగుడ్లు, కిరాణా దుకాణాలకు బిల్లులు రాక వారి దయ దక్షిణాయాలపై హాస్టల్లో నడుస్తున్నాయి. పొద్దున లేస్తే కేటీఆర్, కేసీఆర్‌ను తిట్టడమే తప్ప శాఖలపై రివ్యూ నిర్వహించే ఆలోచన ముఖ్యమంత్రికి లేదు. రాష్ట్రంలో ఏ ఒక్క రంగం సక్కగా లేదు అని జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు.

ప్రభుత్వాసుపత్రికి వెళితే బయటకు వచ్చేదాకా దంంనమ్మకం లేదు. కరోనా సమయంలో దేశానికే గర్వకారణంగా సేవలందించిన సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో మందులు లేక వైద్యానికి ఇబ్బంది నెలకొన్న పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ రంగం, విద్యారంగం, వైద్యరంగం ఏ ఒక్కరంగం కూడా రాష్ట్రంలో సక్కగా లేదు ఇంత మాత్రం దానికి రివ్యూలు ఎందుకు..? రైతు భరోసా 12 వేల కోట్లకు 6000 కోట్లు మాత్రమే ఇచ్చారు. ముఖ్యమంత్రి, మంత్రులు పోటీలు పడి సంపాదించుకుంటున్నారు అని ఆరోపించారు.

రాష్ట్రంలో అన్ని శాఖలు పనిచేయడం లేదని పనిచేసే శాఖ ఏదైనా ఉందంటే అది పోలీస్ శాఖనే. సూర్యాపేట, నల్లగొండ ఎస్పీలు జాగ్రత్తగా పని చేయాలి. ఎస్సై, సీఐలను మీరు కంట్రోల్ చేయాలి తప్ప కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు కాదు. పెద్దాపురం నుంచి మేళ్లచెరువు, డిండి వరకు ఫిర్యాదులు వస్తున్నాయని ప్రతిపక్ష నాయకుల మాటలను ఫార్వర్డ్ చేసిన పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బెదిరిస్తున్నారట. పోలీసులు ప్రజల కోసం పనిచేస్తూ బాధ్యతగా వ్యవహరించుకుంటే మంచిది అని జగదీశ్ రెడ్డి హెచ్చరించారు.

యూరియా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. కేసీఆర్ 10 ఏళ్లలో పంటకు ముందే యూరియా తెప్పించి అందుబాటులో ఉంచాడు. నేడు ముఖ్యమంత్రి యూరియా అందుబాటులో ఉందని చెబుతుంటే మంత్రులు మాత్రం కేంద్రం సహకరించడం లేదని చెబుతున్నారని ఇంతకంటే సిగ్గుమాలిన పని ఇంకోటి ఉండదు. ముఖ్యమంత్రి మాటలు రైతులను మరింత రెచ్చగొట్టేలా ఉన్నాయి. పదేళ్లకు ముందు నీళ్ల గొడవలతో స్టేషన్లలో కేసులు ఉంటే మరల ఇప్పుడు యూరియా అడిగితే కేసులు పెట్టే పరిస్థితి వచ్చింది. నల్లగొండ విషయానికి వస్తే ఎస్ఎల్‌బీసీకి మళ్ళీ పోదాం అని అంటుండు ఆయన మరి వాటర్‌లో నీళ్లు కలుపుతాడు నీళ్లలో వాటర్ కలుపుతాడో. ఎస్ఎల్బీసీలో చచ్చిన శవాలను తీసేందుకు దిక్కులేదు అని జగదీశ్ రెడ్డి విమర్శించారు.

పోలీస్ వ్యవస్థలో గత పదిహేనులుగా తెలంగాణ దేశానికి నెంబర్ వన్‌గా ఉంది. ఎన్నో కేసులను ఛేదించింది. అలాంటిది తెలంగాణ పోలీసులు కించపరుస్తూ సిపిఐకి అప్పగించడం ఏమిటి..? మీ నాయకుడు రాహుల్ గాంధీ సీబీఐని బీజేపీకి పొలిటికల్ రిక్రూట్‌మెంట్ సెంటర్‌గా పని చేస్తుందని చెబుతుంటే నువ్వేమో అదే సీబీఐకి అప్పగించావు. సీబీఐకే కాదు అవసరమైతే ఎఫ్‌బీఐకి మోసాధాకు అప్పగించండి అని జగదీశ్ రెడ్డి సూచించారు.

# భూభారతి చట్టం సయమంలో సీఎం రేవంత్ రెడ్డి నిద్రలేని రాత్రులు : మంత్రి పొంగులేటి

మొదటి పేజీ తరువాయి



ధరణి ద్వారా ఏర్పడిన సమస్యలను గత ప్రభుత్వం పరిష్కరించలేదని మా ప్రభుత్వంలో అధికారులే ప్రజల వద్దకు వెళ్లి భూ సమస్యలు పరిష్కరిస్తున్నారని చెప్పారు. చెప్పిన మాట వినలేదని గత ప్రభుత్వాధినేత గ్రామ రెవెన్యూ వ్యవస్థను రోడ్డున పడేసిందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల లైసెన్స్ సర్వేయర్లను వచ్చే ఉగాది నాటికి రాష్ట్ర ప్రజలకు అంకితం చేయబోతున్నామన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన గ్రామపాలన అధికారులతో పారదర్శకంగా, నిబద్ధతతో, న్యాయబద్ధంగా పని చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

# నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి.. ఎట్టి పరిస్థితుల్లో డీజేలకు అనుమతి లేదు..

మొదటి పేజీ తరువాయి

ఇందులో మతం అంశమే లేదు, పూర్తిగా ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకునే చెబుతున్నాం.. ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం నేడు ఉదయం 6 గంటల నుండి 1:30 వరకు అయిపోయేలా చూస్తాము.. సౌత్ జోన్ విగ్రహాల తరలింపు మాకు అత్యంత ప్రాధాన్యత.. మొత్తం 30 వేల మంది పోలీసులు షిఫ్ట్ లో ఉంటారు.. వందల సి సి కెమెరాలు ఉన్నాయి.. అదనంగా 250 సీసీ కెమెరాలు కొన్నాం.. 6 డ్రోన్స్ తో గణేష్ నిమజ్జనం పర్యవేక్షిస్తాం.. 34 జగిలాలు ఉన్నాయి.. ఎక్కువగా పని భారం అయ్యింది.. రెండు మరణించాయి.. జాగిలాల రక్షణ, సంఖ్య పెంచాలని నిర్ణయించుకున్నాము.. 54కు పెంచాలని నిర్ణయించుకున్నాము.. జాగిలాల క్వాలిటీపై ఇన్ బ్రిడింగ్ సమస్య ఉంది.. పోలీసు డ్యూటీకి సరిగ్గా ఉండేలా కమిటీ వేశాము.. కమిటీ మొత్తం జాగిలాల లవర్స్..

వారికే అనుభవం ఉంటుంది కాబట్టి దేశంలో ఉన్న అన్ని జాగిలాలను గుర్తించాం.. సెంట్రల్ డాగ్ బ్రిడింగ్ దగ్గర కొనేవాళ్ళం.. అభిజిత్ ఫామ్ దగ్గర చెక్ చేసుకొని కొత్తగా 12 జాగిలాలను తీసుకున్నాం.. డాగ్ ట్రైనింగ్ కోసం ISW కు పంపుతాం.. హాండ్లర్ ట్రైనింగ్ జరుగుతుంది.. బాంబులను తనిఖీ చెయ్యడానికి వాసన చూసి డాగ్స్ తనిఖీ చేస్తాయి.. మానవులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని వాడుతాము.. సిటీ సెక్యూరిటీ వింగ్ మండపాల్లో, కొన్ని ప్రాంతాల్లో డాగ్స్ తో తనిఖీలు చేస్తున్నాం.. నిమజ్జనాల్లో కూడా జగిలాలను వాడుతాము.. మొదటి దశలో 12 తీసుకున్నాం.. మరికొన్ని తీసుకుంటాం.. పదకొండున్నర ఎకరాల్లో మౌంటెడ్, డాగ్ కెనాల్ ని నిర్మిస్తాం.. 8వ తేదీన టెండర్లు పూర్తవుతాయి.. 60జాగిలాల కోసం ప్లేస్ ఇస్తూ డాగ్ కెనాల్ కడుతం.. 50గుర్రాలు ఉన్నాయి.. మూడు రిటైర్డ్ అయ్యే స్టేజ్ లో ఉన్నాయి.. మౌంటెడ్ పోలీసు కి మహిళలను ఏర్పాటు చేసాం..

దేశంలో కీలక నిర్ణయం మహిళ మౌంటెడ్ పోలీసులు.. రేపటి నుండి మొదటిసారి మౌంటెడ్ మహిళ పోలీసులు, పోలీసులు గస్తీలో నిమగ్నమై ఉంటారు.. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు రావాలి.. అందుకే మౌంటెడ్ లో మహిళల్ని భాగస్వామ్యం చేసాం.. సీఎం కేటాయించిన స్థలంలో మౌంటెడ్, డాగ్ కెనాల్ ని నిర్మిస్తాం.. డాగ్ స్క్వాడ్, మౌంటెడ్ గుర్రాలు పోలీసులకు చాలా ముఖ్యం.. క్రైమ్ జరిగిన సందర్భంలో స్నిఫర్, డాగ్ ట్రాకర్స్, అటాక్ డాగ్స్ ఇలా అన్నీ వాడుతాము.. గుర్రాలు క్రౌడ్ కంట్రోల్ లో వాడుతాము.. మొహరం బందోబస్తులో ఏనుగులు నడుస్తాయి.. ఏనుగు చుట్టూ జనాలు ఉంటారు కాబట్టి గుర్రాలతో క్రౌడ్ కంట్రోల్ చేశాము" అని తెలిపారు.

# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తెలంగాణ అడుగులు: డిప్యూటీ సీఎం భట్టి

మొదటి పేజీ తరువాయి

యువ రాష్ట్రం ప్రపంచంతో పోటీపడుతోందని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఐఎస్‌బీ విద్యార్థులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం విద్యారంగంపై ఎవరూ ఊహించనిరీతిలో పెట్టుబడులు పెడుతుందని తెలిపారు. విద్యపై పెట్టుబడి రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడుతుందని ప్రజా ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తుందని చెప్పారు.రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను పూర్తి ఉచితంగా అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఒక్కో పాఠశాల నిర్మిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 104 పాఠశాలల నిర్మాణం ప్రారంభించినట్లు వివరించారు. విద్యార్థులు కళాశాల విద్య పూర్తి చేసుకొని బయటకు వెళ్లగానే ఉద్యోగం పొందేలా స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ రూపొందించి అమలు చేస్తున్నట్టు తెలిపారు. స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ ఎలా ఉండాలి అనేది పారిశ్రామికవేత్తలతో మాట్లాడి రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం నేర్చుకోవడానికి ఇష్టపడతారని... రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఐఎస్‌బీలో 5 రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం రూపొందించి అమలు చేయాలని నిర్వాహకులను డిప్యూటీ సీఎం కోరారు.

# ప్రభుత్వ విద్యను రాజకీయాలకు దూరంగా ఉంచాం: మంత్రి లోకేశ్



గురువులు చూపించిన దారిలో నడవడం వల్లే తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకోగలిగానని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీచర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "పిల్లల జీవితాలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే. విద్యాశాఖలో ఏడాదిలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. లీప్ మోడల్‌ను అందరం కచ్చితంగా అమలు చేయాలి. మెగా పేరెంట్-టీచర్ సమావేశాలు ఏర్పాటు చేశాం. పిల్లలను యోగా, క్రీడలు, ఎన్‌సీసీ వైపు ప్రోత్సహిస్తున్నాం. ప్రభుత్వ విద్యను రాజకీయాలకు దూరంగా ఉంచాం. పుస్తకాల సంచులపై ప్రముఖుల ఫొటోలు ముద్రించాం. సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ పేర్లు పెట్టాం. చంద్రబాబు అంటేనే డీఎస్సీ.. డీఎస్సీ అంటే చంద్రబాబు. ఆయన ఆధ్వర్యంలో 13 డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చి 1,83,000 టీచర్ పోస్టులు భర్తీ చేశారు. మొన్నటి డీఎస్సీపై 70 కేసులు పెట్టారు.. అయినా వెనక్కి తగ్గలేదు. న్యాయపరమైన సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాం" అని లోకేశ్ వివరించారు.

# తెలంగాణకు నూతన విద్యా విధానం కావాలి

మొదటి పేజీ తరువాయి

విమర్శలకు ఒకటే మాట చెప్తున్నా.. ఈ శాఖలో ఉన్న సమస్యల పరిష్కారం కోసమే దీనిని తన దగ్గర పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణకు ఎడ్యుకేషన్ పాలసి కావాలి.. ప్రపంచ దేశాలతో విద్యలో తెలంగాణ పోటీ పడాలని సీఎం అన్నారు. తెలంగాణకు ఎడ్యుకేషన్ పాలసి కావాలని స్పష్టం చేశారు. ఆ పాలసీ పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని సూచించారు. ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ మూడో సారి సీఎం కావడానికి కారణం విద్యా రంగంలో ఆయన తెచ్చిన మార్పులే అని గుర్తు చేశారు. తాను కూడా అలా కావాలని అనుకుంటున్నట్లు సీఎం చెప్పారు. తనకు కూడా రెండో సారి, మూడో సారి సీఎం కావాలని ఉంటుంది అన్నారు. తాను ఫార్మ్ హౌస్‌లో పడుకుని మిమ్మల్ని పని చేయమని చెప్పానని, డీజిల్ మెకానిక్ నేర్చుకుంటే ఉపయోగం ఏంటని, BMW, బెంజ్ కార్ల కాలంలో అని సీఎం ప్రశ్నించారు. అంబాసడర్ కారు కావాలంటే ఫార్మ్ హౌస్‌కు వెళ్ళాలని అన్నారు. విద్యార్థుల జీవితాల్లో మార్పులు తీసుకురావాలని యంగ్ ఇండియా స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ బారిన పడుతున్నారు. డ్రగ్స్ మహమ్మారి తాలూకా స్థాయికి చేరిందని అన్నారు. దీనిని అరికట్టడానికి ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. అందరం కలసి అద్భుతమైన తెలంగాణను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. కేజీ 2 పీజీ ఉచిత నిర్భంద విద్య అందిందా.. కేజీ టు పీజీ అంటే గతంలో ఉన్న ప్రభుత్వానికి మీరు సంపూర్ణ మద్దతు అందించారు. కేజీ 2 పీజీ ఉచిత నిర్భంద విద్య అందిందా అని సీఎం ప్రశ్నించారు. మారుమూల ప్రాంతాల్లో స్కూల్స్ మూత పడ్డాయో లేదో ఆలోచించాలని అన్నారు. తెలంగాణ నినాదాన్ని, ఉద్యమాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లింది టీచర్‌లని గుర్తు చేశారు. తెలంగాణ సాధనలో క్రియాశీలకంగా వ్యవహరించిన టీచర్‌లు గత పదేళ్లలో ఎన్ని సమస్యలను పరిష్కరించుకున్నారని సీఎం ప్రశ్నించారు. గత పాలకులకు ఉపాధ్యాయుల సమస్యలను ప్రరిష్కరించాలనే ఆలోచన రాలేదు%?% తమ ప్రభుత్వం వచ్చాకే వారి సమస్యలు పరిష్కారం అయ్యాయని చెప్పారు. %ఎతేం% ప్రజా ప్రతినిధుల ప్రైవేట్ వర్సిటీలు పెట్టుకొని వ్యాపారం చేశారని, ప్రభుత్వ వర్సిటీల్లో గత ప్రభుత్వం నియామకాలు చేపట్టలేదని విమర్శించారు. ఓయూ మూత పడే పరిస్థితికి వచ్చిందని అన్నారు. గురుపూజోత్సవం గత ప్రభుత్వంలో జరిగిందా%?% గత ప్రభుత్వంలో గురుపూజోత్సవం జరిగిందా.. ఆ కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి వచ్చారా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మీ లాంటి టీచర్‌లు చెప్పిన చదువు నేర్చుకునే ఈ స్థాయికి వచ్చానని ఆయన అన్నారు. ఉపాధ్యాయులను చిన్నచూపు చూసే ఆలోచన ప్రజాప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు ఎక్కువగా ఉన్న, తక్కువగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారని, దీనికి కారణం అయితే తాను కావాలి లేదంటే ఉపాధ్యాయులు అయ్యి ఉండాలని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్‌లో కన్నా ప్రభుత్వ స్కూల్ టీచర్‌లు అధికంగా చదువుకున్నవారు.. ఇకపై సర్కార్ స్కూల్స్‌లో పిల్లల నమోదు సంఖ్య పెరగాలని అన్నారు. స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని అందుకే ప్రతి ఏడాది రూ.130 కోట్ల సీఎస్ఆర్ నిధులు పాఠశాలలో క్లీనింగ్‌కు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురవడం తనకు బాధ కలిగిందని సీఎం అన్నారు. ఇకపై ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని.. అప్పుడప్పుడు తాను కూడా వచ్చి మీతో, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తానని సీఎం అన్నారు.

# ధరణి దరిద్రాన్ని భూభారతితో తొలగించాం

తెలంగాణలో అన్ని పోరాటాలు భూమి చుట్టూనే తిరిగాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొమురంభీమ్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, రావి నారాయణరెడ్డి తదితరులు భూమి కోసమే పోరాడారని తెలిపారు. భూమికి, తెలంగాణ ప్రజలకు మధ్య ఉన్న బంధం.. తల్లీబిడ్డకు ఉన్న సంబంధమన్న ఆయన.. భూమిని ఆక్రమించుకోవాలని చూసిన వారిని తెలంగాణ ప్రజలు తరిమికొట్టారన్నారు. గ్రామ పరిపాలన అధికారులకు (జీపీవో) నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం చేతులమీదుగా జీపీవోలకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమంలో రెవెన్యూ సిబ్బంది ఉవ్వెత్తున పాల్గొన్నారని అన్నారు. రాష్ట్ర సాధనలో రెవెన్యూశాఖ సిబ్బంది కీలకపాత్ర పోషించారని చెప్పారు. ఉద్యమంలో పాల్గొన్న సిబ్బందికి గత సీఎం మేలు చేస్తారని అందరూ ఆశించారని, కానీ ఆరోపణలు తట్టుకోలేక సిబ్బంది ఆత్మహత్య చేసుకున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజలను దోచుకున్నది రెవెన్యూ ఉద్యోగులే అన్నట్లు గత ప్రభుత్వం చిత్రీకరించిందన్నారు. "ధరణి వివరాలు ప్రజలకు తెలియకూడదని వీఆర్‌వో, వీఆర్‌ఏలను తొలగించారు. లేదంటే వారి దుర్మార్గాలు తెలుస్తాయని భావించారు. ధన, భూదాహంతో భూమిని చెరబట్టాలని ధరణి తీసుకొచ్చారు. వారి దోపిడీకి అడ్డుగా ఉన్నారని వీఆర్‌వో, వీఆర్‌ఏలను తొలగించారు. రెవెన్యూశాఖ కావాలని పొంగులేటి అడగలేదు. వారి సమర్థత గుర్తించి ఇచ్చాం. ధరణితో పట్టుకున్న దరిద్రాన్ని.. భూభారతితో తొలగించే ప్రయత్నం చేశాం. ప్రజలకు రెవెన్యూ అధికారుల వల్ల సమస్యలు రాలేదు. ధరణి వల్లే సమస్యలు వచ్చాయి. ప్రజల సమస్యలు పరిష్కరించాలంటే జీపీవోలు అందుబాటులో ఉండాలి. సాదాబైనామాల సమస్యలను అధికారులు పరిష్కరించాలి. " అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# కేసీఆరే సుప్రీం.. తుది నిర్ణయం పార్టీదే: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

మరోవైపు.. ఈ క్రమంలోనే అక్కడ మీడియా ఆయనను కవిత ఇష్యూపై ప్రశ్నించింది. కానీ, ఆయన సమాధానం చెప్పలేదు. ఇండియా వెళ్లిన తరువాతనే మాట్లాడతానని చెప్పినట్టు తెలిసింది. నేడు ఆయన ఇండియాకు రాబోతున్నట్టు సమాచారం. అనంతరం మీడియా సమావేశం నిర్వహిస్తే ఏం మాట్లాడుతారు అన్నది సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# ఇదేనా నాకిచ్చే గౌరవం? ..

ఉపాధ్యాయుల తీరుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా నల్గొండలో నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేసి, బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతుండగా.. టీచర్లు భోజనానికి వెళ్లారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి వారిపై అసహనం వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడుతుండగా టీచర్లు అలా చేయడం ఏం బాలేదన్నారు. 5 నిమిషాల పాటు తనకెంతో బాధ అనిపించిందని, ఇదేనా టీచర్లకు ఉన్న క్రమశిక్షణ అని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల తీరుపై మంత్రి కోమటిరెడ్డి వేదికపై ఉన్న డీఈఓ భిక్షపతిని మందలించారు. తాను వైరల్ ఫీవర్ తో బాధపడుతూ కూడా ఈ కార్యక్రమానికి వచ్చానని, టీచర్లు తనకిచ్చే గౌరవం ఇదేనా అని ఆవేదన వ్యక్తం చేశారు.

# మూల్యం చెల్లించుకోక తప్పదు.. కవిత మరో ట్వీట్



పాలకుల మెప్పుకోసం పోలీసులు ప్రజలను ఇబ్బంది పెడితే మూల్యం చెల్లించుకోక తప్పదనే విషయం గుర్తుంచుకోవాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. యూరియా కొరతపై ప్రశ్నించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన రైతు లక్ష్మణ్ యాదవ్ ఇంటికి పోలీసులు వెళ్లడంపై ఎక్స్ వేదికగా శుక్రవారం కవిత స్పందించారు. యూరియా కొరతపై ప్రశ్నించడమే నేరమా? ఇందిరమ్మ రాజ్యమంటే వేధింపులు, బెదిరింపులా అని నిలదీశారు. ఇందుకు సంబంధించిన వీడియోను షేర్ చేసిన ఎమ్మెల్సీ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమిది అని మండిపడ్డారు. యూరియా కొరతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రైతు లక్ష్మణ్ యాదవ్ నిలదీశాడని పోలీసులు ఇంటికి వెళ్లి వేధింపులకు గురి చేశారు. కాంగ్రెస్ నాయకుడు ఫిర్యాదు చేయడమే ఆలస్యం అన్నట్టుగా పోలీసులు చట్టవ్యతిరేక చర్యలకు దిగుతున్నారు. ఇలాంటి దారుణాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు.

# రాబోయే కాలం బిఆర్ఎస్ పార్టీదే - మాజీ ఎంపీ నామ

మొదటి పేజీ తరువాయి

యూరియా సంక్షోభం వెనుక కుట్ర ఉందని, పంటల కొనుగోళ్లు, బోనస్‌లు ఎగవేయడానికే ప్రభుత్వం కావాలనే యూరియా సరఫరా చేయడం లేదు, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది, ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలి . ఎర్రవల్లిలోని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్ చేతిలో పెట్టామని కానీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలోనూ, గతంలో ఉన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలోనూ ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, తమకు పరిపాలన చేతకావడం లేదని, అన్ని కార్యక్రమాలను అమలు చేయలేమని నేరుగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 21 నెలల్లోనే ప్రజల నుంచి సంపూర్ణ వ్యతిరేకతను మూటగట్టుకుందని కేటీఆర్ విమర్శించారు. హామీల వైఫల్యం, నమ్మకద్రోహం ఒక కారణం అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల తీరు, వ్యవహార శైలి మరో ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిక్షణం కేసీఆర్ పేరు తలుచుకుంటూ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని నడపడం చేతగాక, గత ప్రభుత్వం అప్పులు చేసిందని కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని కేటీఆర్ మండిపడ్డారు.

గత ప్రభుత్వం కేవలం రూ. 2.80 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేసిందని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. అయితే, ఈ 21 నెలల కాలంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 2.20 లక్షల కోట్ల పైగా అప్పులు చేసిందని, ఆ అప్పుతో ఏ ఒక్క సంక్షేమ పథకం లేదా అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వం సంవత్సరానికి రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తే, ఈ ప్రభుత్వం నెలకు రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తోందని ఆరోపించారు. యూరియా సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు దారితీస్తోందని కేటీఆర్ అన్నారు. పంటల కొనుగోళ్లకు, ఆ తర్వాత వాటికి ఇవ్వాల్సిన బోనస్‌ను ఎగగొట్టాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే యూరియా సరఫరా చేయడం లేదని ప్రజలు భావిస్తున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగం, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత దుర్మార్గమైన ఆలోచన ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఫిరాయింపులపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, త్వరలో రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని కేటీఆర్ అన్నారు. స్పీకర్ లేదా ఫిరాయింపుదారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా రాబోయే ఆరు నెలల కాలంలో ఉప ఎన్నికలు వస్తాయని ఆయన అన్నారు. ఈ ఎన్నికల్లో బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డి ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని కేటీఆర్ హెచ్చరించారు. పోచారం ఎమ్మెల్యే పదవి కూడా పోయే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పుకోలేని దయనీయమైన స్థితిలో ఉన్నారని, కానీ బీఆర్ఎస్‌లో ఉన్న ప్రతి కార్యకర్త గర్వంగా తెలంగాణ తెచ్చిన పార్టీలో ఉన్నామని చెప్పుకోవచ్చని కేటీఆర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్ సభాపక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్ షిండే, జాజుల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు కుటుంబ సభ్యులు...
# విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు



**హైదరాబాద్ బ్యూరో, 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) :** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ధర్మపత్ని విజయలక్ష్మీ, కూతురు డాక్టర్ గంగుల గంగాభవాని, కుమారుడు నిఖిల్ చంద్రలు విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు



చేశారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఎంపీ రవిచంద్ర నివాసం వద్ద వీఆర్సీ యూత్ అసోసియేషన్ సభ్యులు గణనాథుడిని ప్రతిష్ఠించి నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నిమజ్జనానికి బయలుదేరడానికి ముందు వినాయకుడికి శుక్రవారం విజయలక్ష్మీ, నిఖిల్ చంద్రలు పూలమాల వేసి,హారతినిచ్చి గోత్ర నామంతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గంగాభవాని తన కుమారులు సౌరవ్, సనవ్ లతో కలిసి గణనాథుడికి కొబ్బరికాయలు కొట్టి గోత్ర నామంతో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వారికి ఆశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. వీఆర్సీ యూత్ అసోసియేషన్ సభ్యులు ముద్దంగుల కృష్ణ, గగులోతు నవీన్ నాయక్, యరగాని పృథ్వీ గౌడ్, ముకుంద అనిల్ పటేల్, అనంతుల శ్రీనివాస్ గౌడ్, మల్యాల శేఖర్, నాగిరెడ్డి, ముకరా దుర్గాప్రసాద్, దండు రాజు ధూదిగామ సాత్విక్, జ్యోతి, సంతోష్ తదితరులు విజయలక్ష్మీ, గంగాభవాని, నిఖిల్ చంద్ర, స్థానిక ప్రముఖులను శాలువాలతో సత్కరించి వినాయకుడి చిత్రపటాలను బహూకరించారు. వీఆర్సీ యూత్ అసోసియేషన్ సభ్యులు అందజేసిన విఘ్నేశ్వరుడి లడ్డూ ప్రసాదాన్ని నిఖిల్ చంద్ర భక్తిప్రపత్తులతో స్వీకరించి తలపై పెట్టుకుని తన నివాసంలోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వీఆర్సీ యూత్ అసోసియేషన్ సభ్యులు"జై గణేశ జైజై గణేశ" అంటూ నినాదాలు చేశారు.

# ప్రభుత్వానికి కృతజ్ఞతలు

## -తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి



**హైదరాబాద్ బ్యూరో , 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్)** : రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి చట్టం - 2025 అమలులోకి తీసుకురావడంతో పాటు గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా జీపీవోలకు నియామక పత్రాలను అందించడం వలన గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుంది. రాష్ట్రంలో ఆనవాళ్ళు కోల్పోయిన రెవెన్యూ శాఖను పునర్నిర్మాణం చేస్తున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ తరుపున, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ తరుపున, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ తరుపున, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ తరుపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. అలాగే సీఎం రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో దేశంలో ఎక్కడా కూడా లేని సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను సృష్టించడం, రెవెన్యూ ఉద్యోగుల పదోన్నతులు కల్పించడం, ప్రభుత్వానికి రెవెన్యూ ఉద్యోగులందరం రుణపడి ఉంటాము. అలాగే సర్వేయర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు లైసెన్సుడ్ సర్వేయర్ లను నియమించేందుకు ప్రభుత్వం హామీ ఇవ్వడం వలన గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు ప్రజలకు, రైతులకు మెరుగైన సేవలు నిర్ణీత కాలంలో అందుతాయి. అలాగే రెవెన్యూ ఉద్యోగులకు అండగా ఉంటానని సీఎం గారు చెప్పడంతో జీపీవోలతో పాటు రెవెన్యూ శాఖ ఉద్యోగులందరూ రెట్టించిన ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తారు. జీపీవోల నియామక సభలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి, , డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రామకృష్ణ, టీజీటీఏ అధ్యక్ష కార్యదర్శులు రాములు, పాక రమేష్ , టీజీఆర్ఎస్ఏ



అధ్యక్ష కార్యదర్శులు బాణాల రామ్ రెడ్డి, బిక్షం, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ, టీజీటీఏ రాష్ట్ర నాయకులు పూల్ సింగ్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర కోశాధికారి మల్లేష్, సీసీఎల్ఏ నాయకులు రాంబాబు, చైతన్య, సుజాత చౌహాన్ తదితరులు సీఎం రేవంత్ రెడ్డి గారిని కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.


# రాష్ట్రానికి క్రిమినల్ సీఎంగా ఉన్నారు..
## గట్టు రామచందర్ రావు సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ ,05 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రాన్ని దౌర్భాగ్యపు సీఎం పాలిస్తున్నాడు.. రాష్ట్రాన్ని దౌర్భాగ్య స్థితిలోకి నెట్టేస్తున్నాడు.. రాష్ట్రానికి క్రిమినల్ సీఎంగా ఉన్నారు అని బీఆర్ఎస్ సీనియర్ నేత గట్టు రామచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో గట్టు రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. దేశంలో అత్యధిక క్రిమినల్ కేసులున్న సీఎంగా రేవంత్ రెడ్డి ఘనత వహించారు. అన్ని వర్గాల పట్ల సీఎం రేవంత్ రెడ్డిది నేరపూరిత నిర్లక్ష్యం. రేవంత్ రెడ్డికి ఎందుకు ఓటేశామని ప్రజలు తమ చెప్పులతో తామే కొట్టుకుంటున్నారు. హార్టికల్చర్‌కు, అగ్రికల్చర్‌కు తేడా తెలియని సీఎం రేవంత్ రెడ్డి. సీఎంగా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ ఎలా భరిస్తుందో..? సీఎంగా రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు ఆత్మహత్యతో సమానం. నిజంగా వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినవాడు అయితే రేవంత్ రెడ్డి ఎరువుల కొరత నిజమే అని ఒప్పుకునే వాడు. ఇప్పుడు ఎరువుల కొరత లేదంటున్నాడు.. రేపు తెలంగాణలో రేవంత్ రెడ్డి అసలు రైతులే లేరని అన్నా అంటారు అని గట్టు రామచందర్ రావు విమర్శించారు.

పైన మేనేజ్‌మెంట్.. కింద బిజినెస్ అన్నట్టుగా ఉంది రేవంత్ తీరు. పాలన మీద కన్నా పక్కోడు కుర్చీ గుంజుకుంటారనే భయంతో రేవంత్ పాలిస్తున్నాడు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారు. క్రిమినల్ చేతిలో రాజ్యం ఉంటే ఏ విధంగా ఉంటుందో తెలంగాణ పరిస్థితి అలా తయారైంది. దేశంలో క్రిమినల్ కేసులు ఉన్న ముఖ్యమంత్రుల్లో 89 కేసులతో సీఎం రేవంత్ రెడ్డి మొదటి స్థానంలో వున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రెండవ స్థానంలో ఉన్నారు. రాష్ట్రంలో క్రిమినల్ చర్యలతో ప్రభుత్వం అణచివేతకు గురిచేస్తోంది. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన కనపడుతుంది. చదువు గురించి తెలియదు కానీ విద్యా శాఖా మంత్రి రేవంత్ రెడ్డి. లా అండ్ ఆర్డర్ గురించి తెలియదు కానీ రేవంత్ రెడ్డి హోంశాఖ మంత్రి. అన్నింటికి మించి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అని గట్టు రామచందర్ రావు విమర్శించారు.

# ఇద్దరు పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకున్న తల్లి




**నారాయణఖేడ్, 05 సెప్టెంబర్ (కెరటం న్యూస్) :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం నిజాంపేట్‌లో దారుణం జరిగింది. ఇద్దరు పిల్లలను గొంతు నులిమి చంపి తల్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లాలో కలకలం రేపింది. కుటుంబ కలహాల కారణంగా ప్రమీల తన ఇద్దరు కుమారులు ధనుష్ (3), సూర్య వంశీ (నెలన్నర)ని గొంతు నులిమి చంపేసింది. అనంతరం ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కల్వకుంట్ల పంచాయతీని పట్టించుకోవాల్సిన అవసరం లేదు - ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హైదరాబాద్ ,05 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కల్వకుంట్ల కవిత ఆరోపణలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించారు. ఆయన బీఆర్ఎస్ పార్టీకి ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో కూడా మొదటి సారి మీడియా ఎదుట స్పందించారు. ఆయన కవిత ఎపిసోడ్‌పై మాట్లాడుతూ.. అది ఆస్తి తగాదాలకు సంబంధించినది మాత్రమే అని అన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ వనరులను అన్నింటిని కూడా దొచుకుంది. ధరణిని అడ్డం పెట్టుకొని వేల ఎకరాల భూమిని కబ్జా చేశారు. కాళేశ్వరాన్ని అడ్డం పెట్టుకొని వేల కోట్ల డబ్బులను సంపాదించుకున్నారు. ఇప్పుడు వేల ఎకరాలు పంచుకునే క్రమంలో, వేల కోట్ల రూపాయలను పంచుకునే క్రమంలో వారి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. కల్వకుంట్ల కుటుంబం తెలంగాణపై పడి దోచుకుంది. అందుకే వారిని తెలంగాణ ప్రజలు పక్కన పెట్టారు. ఇప్పుడు కల్వకుంట్ల కుటుంబంలో జరుగుతున్న పంచాయతీతో ప్రజలకు, తెలంగాణకు, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదు. అది వాళ్ల కుటుంబ పంచాయతీ, ఆస్తుల గొడవ మాత్రమే. ఆనాడు కవిత లిక్కర్ కేసులో ఇన్వాల్వ్ అయ్యింది. నేను ఆనాడు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడానికి ప్రధానమైన కారణం ఒక ముఖ్యమంత్రి బిడ్డ లిక్కర్ కేసులో విచారణ ఎదుర్కోవడమే. ఆమె అనేక రోజులు జైలులో ఉండడం కూడా కొంచెం బాధగా అనిపించింది. ఇది సరైన పద్ధతి కాదని పెంచింది. అందుకే బీఆర్ఎస్ నుంచి బయటికి రావడం జరిగింది. ఏది ఏమైనా ఈ రోజు జరుగుతున్న గోడవ అంతా ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు.. పత్రికలు కూడా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఇది అవినీతి ద్వారా సంపాదించిన డబ్బును పంచుకోవడం కోసం జరుగుతున్న పంచాయతీ తప్పా ఇది ప్రజలకు ఉపయోగపడే పంచాయతీ కాదని ఆయన అన్నారు.

# జీఎస్టీ సంస్కరణలతో తక్కువ ధరల్లోనే వినోదం: మంత్రి కందుల దుర్గేశ్



**అమరావతి ,05 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** దేశంలో పన్ను వ్యవస్థను సులభతరం చేయడం కోసం జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైందని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. జీఎస్టీ శ్లాబుల సరళీకరణ.. పర్యాటక, సినిమా రంగాలకు ఊతమందిస్తుందని తెలిపారు. ఈ సంస్కరణలతో తక్కువ ధరల్లోనే వినోదం లభించనుందని వివరించారు. బడ్జెట్ ట్రావెలర్, దేశీయ టూరిజానికి ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు."18 శాతం శ్లాబ్ పరిధిలోకి సినిమా ప్రొడక్షన్ సేవలు తేవడం ద్వారా నిర్మాతలకు ఆర్థికంగా మేలు జరుగుతుంది. పన్నులు తగ్గితే సినిమా, పర్యాటక రంగాల్లో ఉపాధి పెరిగి స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. హోటల్ రూమ్ టారిఫ్‌లు 7,500 లోపు ఉన్న వాటిపై పన్ను 5 శాతానికి తగ్గించారు. రెస్టారంట్ బిల్లులపై పన్ను కూడా 5 శాతానికి తగ్గించారు. వస్తు సేవల పన్నులో సంస్కరణలు తెచ్చిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు" అని కందుల దుర్గేశ్ తెలిపారు.

# రంగారెడ్డి జిల్లాలో షాకింగ్ ఘటన..
# రాత్రికి రాత్రే సమాధులు మాయం!



**రంగారెడ్డి ,05 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఓ కుటుంబానికి చెందిన సమాధులనే మాయం చేశారు. దాదాపు ఆరు సమాధులను ధ్వంసం చేసి అందులోని హస్తికలను సైతం ఎత్తుకుపోయారు. మొదట బాధిత కుటుంబం శంకరయ్య అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి తమ పొలాన్ని అమ్మేసింది. అయితే తమ పెద్దల సమాధులు నిర్మించి ఉండటంతో గుంట భూమి మినహాయించి మిగితాది అమ్మేశారు.

ఆ భూమిని కొన్న వ్యక్తి రవి అనే మరో రియల్ వ్యాపారికి అమ్మేశాడు. కాగా ఇప్పుడు ఆ సమాధులు అడ్డుగా ఉన్నాయని రాత్రికి రాత్రే సమాధులను తవ్వించారు. వాటి నిర్మాణాలను కనిపించకుండా చేశారు. సమాధులను తవ్వడంతో పాటు అందులోని హస్తికలను సైతం మాయం చేశారు. రాత్రికి రాత్రే ఈ దారుణానికి పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. 24 ఏళ్ల నుండి ఆ సమాధులున్నాయని తమ భూమి తమకు ఇప్పించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాధులను తవ్విన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# యాదగిరిగుట్ట ఆలయానికి రూ.4 కోట్ల ఇల్లు విరాళం



**హైదరాబాద్ ,05 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి ముత్తినేని వెంకటేశ్వర్లు.. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి విశేషమైన విరాళాన్ని అందించారు. హైదరాబాద్ తిలక్‌నగర్‌లో 152 గజాల్లో ఉన్న, రూ.4 కోట్ల విలువైన తన మూడంతస్తుల ఇంటిని ఆలయానికి దానం చేశారు. ఆలయ ఈవో వెంకట్రావు సమక్షంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి పేరు మీద చిక్కడపల్లిలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో గురువారం రిజిస్ట్రేషన్ చేయించారు. తర్వాత పత్రాల్ని ఆలయ ఈవో వెంకట్రావుకు అందించారు. ఈ సందర్భంగా ఈవో.. దాత వెంకటేశ్వర్లును స్వామివారి కండువాతో సన్మానించి, ప్రసాదం అందించారు. దాతను దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యకార్యదర్శి శైలజా రామాయ్యర్ అభినందించారు.

# నోట్లో పుండ్లు ఏర్పడి ఇబ్బందిగా ఉందా..?



హెల్త్ న్యూస్,05 సెప్టెంబర్ (కెరటం న్యూస్): నోట్లో పుండ్లు అనేవి సహజంగానే చాలా మందికి వస్తుంటాయి. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. ఇవి కొందరికి పెదవులపై వస్తే కొందరికి లోపలి వైపు వస్తాయి. కొందరికి నోట్లో నాలుకపై, నాలుక చుట్టూ లేదా కింద భాగంలో కూడా వస్తాయి. కొందరికి చిగుళ్ల వాపులు కూడా వస్తాయి. రక్తస్రావం కూడా జరుగుతుంది. ఏం తినాలన్నా, తాగాలన్నా చాలా ఇబ్బందిగా ఉంటుంది. అయితే నోట్లో పుండ్లు అనేవి అనేక కారణాల వల్ల వస్తుంటాయి. బాగా వేడిగా ఉన్న ఆహారాలను తిన్నప్పుడు లేదా తాగినప్పుడు నోట్లో పుండ్లు ఏర్పడుతాయి.అలాగే టూత్ బ్రష్‌ను బలంగా వాడినా, పదని టూత్ పేస్ట్‌ను వాడినా, పోషకాహార లోపం ఉన్నా, ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉన్నా, హార్మోన్ సమస్యల కారణంగా, పలు రకాల మందులను వాడడం వల్ల కూడా నోట్లో పుండ్లు ఏర్పడుతాయి. అయితే కొన్ని రకాల చిట్కాలను పాటిస్తే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

ఉప్పు నీళ్లు..

ఉప్పు నీటిని నోట్లో పోసుకుని పుక్కిలించడం వల్ల నోట్లో ఉన్న పుండ్ల సమస్య నుంచి బయట పడవచ్చు. ఉప్పు నీటిలో యాంటీ సెప్టిక్ గుణాలు ఉంటాయి. ఇవి నోట్లో ఉండే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. దీంతో నోట్లోని పుండ్లు నయమవుతాయి. 1 టీస్పూన్ ఉప్పును ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో వేసి బాగా కలిపి ఆ నీళ్లను నోట్లో పోసుకుని 30 సెకన్ల నుంచి 1 నిమిషం పాటు బాగా పుక్కిలించాలి. ఇలా రోజుకు 3 నుంచి 4 సార్లు చేస్తుంటే ఫలితం ఉంటుంది. తేనెలో సహజసిద్ధమైన యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నోట్లో పుండ్లను తగ్గిస్తాయి. నోట్లో ఉండే నొప్పి నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. తేనెను కొద్దిగా తీసుకుని నోట్లో పుండ్లు ఉన్న చోట నేరుగా రాయవచ్చు. ఇలా రోజుకు 2 నుంచి 3 సార్లు చేస్తుండాలి. దీంతో నోట్లోని పుండ్లు తగ్గిపోతాయి.

కొబ్బరినూనె..

నోట్లోని పుండ్లను తగ్గించేందుకు కొబ్బరినూనె కూడా పనిచేస్తుంది. ఇందులో లారిక్ యాసిడ్ ఉంటుంది. ఇది యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల నోట్లో ఉండే వాపులను తగ్గిస్తుంది. నోరు, నాలుకకు సంరక్షణ పొరగా నిలుస్తుంది. నోటి అల్సర్లను తగ్గిస్తుంది. కొద్దిగా కొబ్బరినూనెను తీసుకుని నోట్లో పుండ్లు ఉన్న చోట నేరుగా రాయాలి. రోజులో ఇలా మీకు వీలున్నన్ని సార్లు చేయాలి. దీంతో పుండ్లు తగ్గిపోతాయి. ఈ పుండ్లను తగ్గించేందుకు బేకింగ్ సోడాపేస్ట్ కూడా పనిచేస్తుంది. బేకింగ్ సోడా వల్ల నోట్లో అధికంగా ఉండే యాసిడ్ల ప్రభావం తగ్గుతుంది. దీంతో నోట్లోని పుండ్లు తగ్గిపోతాయి. ఇందుకు గాను కొద్ది మొత్తంలో బేకింగ్ సోడాను తీసుకుని కొన్ని చుక్కల నీటితో కలిపి మెత్తని పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని నోట్లో ఉండే పుండ్లపై రాయాలి. కాసేపు అయ్యాక నోట్లో నీళ్లు పోసుకుని కడిగేయాలి. ఇలా రోజూ చేస్తున్నా కూడా ఈ సమస్య తగ్గుతుంది.

కలబంద గుజ్జు..

కలబంద గుజ్జులో సహజసిద్ధమైన యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నోట్లో ఏర్పడే అల్సర్లను తగ్గిస్తాయి. కలబంద గుజ్జును కొద్దిగా తీసుకుని నోట్లో అల్సర్లపై నేరుగా రాయాలి. కాసేపు అయ్యాక నోట్లో నీళ్లు పోసుకుని పుక్కిలించి ఉమ్మేయాలి. ఇలా రోజుకు 3 నుంచి 4 సార్లు చేయాలి. దీని వల్ల నోట్లో ఉండే నొప్పి, అల్సర్లు తగ్గిపోతాయి. సాధారణంగా ఇలాంటి చిట్కాలను పాటిస్తే 3 లేదా 4 రోజుల్లో ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. కానీ వారం రోజులు దాటినా కూడా ఈ సమస్య తగ్గడం లేదంటే అప్పుడు చాలా బలమైన కారణం ఉండి ఉంటుందని అర్థం చేసుకోవాలి. దీనికి గాను డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. వారు అన్ని విధాలుగా పరిశీలించి సమస్యను గుర్తించి అందుకు తగిన విధంగా చికిత్సను అందిస్తారు. దీంతో నోట్లోని పుండ్లు తగ్గిపోతాయి.

# దక్షిణాఫ్రికా చేతిలో సిరీస్ ఓటమి.. ఇంగ్లాండ్‌కు పెద్ద చిక్కొచ్చింది!



స్పోర్ట్స్ న్యూస్,05 సెప్టెంబర్ (కెరటం న్యూస్): వన్డే ప్రపంచ కప్‌నకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. అయినా సరే ఇంగ్లాండ్ క్రికెట్ జట్టులో ఆందోళన మొదలైంది. దానికి కారణం దక్షిణాఫ్రికా చేతిలో సిరీస్‌ను కోల్పోవడం. అదేంటి ఒక్క సిరీస్ పోయినంత మాత్రాన ఇంగ్లాండ్‌కు వచ్చే నష్టమేంటి? అనే అనుమానం రాకమానదు. అయితే, ఈ సిరీస్ మాత్రమే కాదు ఈ రెండేళ్ల కాలంలో ఆ జట్టు ఆడే వన్డేల్లో ఎక్కువ ఓడిపోతే మాత్రం అవమానంతో పాటు పెద్ద చిక్కు వచ్చి పడటం ఖాయం. మరి వరల్డ్ కప్ టోర్నీకి ఇంగ్లాండ్ వన్డేలకు లింక్ ఏంటో చూద్దాం..

హ్యారీ బ్రూక్ నాయకత్వంలో ఇంగ్లాండ్ జట్టుకు ఇటీవల ఏదీ కలిసిరావడం లేదు. తొలిసారి అతడు సారథ్యం చేపట్టి విండీస్‌తో సిరీస్ ఆడాడు. అక్కడ క్లీన్‌స్వీప్ చేయడంతో బ్రూక్‌పై ప్రశంసల వర్షం కురిసింది. ఆ తర్వాత నుంచి అంతా గడ్డుకాలమే. వరుస ఓటములను చవిచూసింది. గత వన్డే ప్రపంచ కప్ తర్వాత ఇప్పటి వరకు ఆ జట్టు ఆడిన 21 వన్డే మ్యాచుల్లో కేవలం ఏడింట్లోనే విజయం సాధించింది. దీంతో ఆ జట్టు ర్యాంక్ 8కి చేరింది. ఒకవేళ ఇలాగే కొనసాగి భవిష్యత్తులో ఆడబోయే మ్యాచుల్లోనూ ఓడితే మాత్రం.. 2027 వన్డే ప్రపంచకప్ పోటీల్లో పాల్గొనేందుకు నేరుగా అర్హత దక్కదు. అప్పుడు క్వాలిఫయర్స్‌లో ఆడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ప్రస్తుతం విండీస్ (80) కంటే ఇంగ్లాండ్ (86) ఆరు పాయింట్లు మాత్రమే ముందుంది. బంగ్లాదేశ్ (77) కూడా రేసులో నిలిచింది. ఈ జాబితాలో టీమ్ఇండియా (124)దే అగ్రస్థానం. ఇప్పుడు దక్షిణాఫ్రికాతో చివరి వన్డేలోనూ ఇంగ్లాండ్ ఓడితే పాయింట్లపై ప్రభావం పడటం ఖాయం.

బరిలోకి 14 జట్లు..

దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా 2027 వన్డే ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. తొలి రెండు జట్లకు నేరుగా అర్హత లభిస్తుంది. నమీబియా పూర్తిస్థాయి సభ్యదేశం కాకపోవడంతో.. ఆ జట్టు క్వాలిఫయర్స్‌లో ఆడి రావాల్సి ఉంది. ఐసీసీ ర్యాంకుల్లో తొలి ఎనిమిదిలో నిలిచిన జట్లకు డైరెక్ట్ ఎంట్రీ ఉంటుంది. మిగతా జట్లు క్వాఫలియర్స్‌లో ఆడి రావాలి. దాదాపు 20 నెలల వ్యవధి ఉండటం ఇంగ్లాండ్‌కు కలిసొచ్చినా.. ఏమాత్రం పరాజయం చవిచూసినా కష్టాలు తప్పవు. భారత్, న్యూజిలాండ్, పాకిస్థాన్‌తో వన్డే సిరీసులు ఉన్నాయి.

# ఆమె సలహాలు పాటిస్తా..

నాగచైతన్య ఇప్పుడు మంచి జోష్ లో ఉన్నాడు. తండేల్ తో భారీ హిట్ అందుకున్న ఈయన.. ప్రస్తుతం కార్తీక్ దండుతో పెద్ద సినిమానే చేస్తున్నాడు. ఈ మూవీ ప్రస్తుతం వరుసగా షూటింగ్ జరుపుకుంటోంది. అయితే శోభిత గురించి ఎప్పటికప్పుడు ఏదో ఒకటి చెబుతున్న నాగచైతన్య.. ప్రస్తుతం మరోసారి ఆమె గురించి షాకింగ్ కామెంట్స్ చేశాడు. తాజా ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. నేను ఇప్పుడు లవ్ స్టోరీ సినిమాలు చేయడం తగ్గించేశా. ఎందుకంటే ప్రేక్షకుల మైండ్ సెట్ మారిపోయింది. రెగ్యులర్ లవ్ స్టోరీలు కాకుండా వరల్డ్ బిల్డింగ్, యాక్షన్ సినిమాలనే ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

నేను కూడా అలాంటి వాటిలోకి వెళ్లాలని శోభిత చెప్పింది. ఆమె సలహాలు బాగుంటాయి. ఒక ప్రేక్షకురాలిగా సినిమాను చూసి ఎలా ఉండాలో జెన్యూన్ గా చెబుతుంది. బాగా లేకపోతే ముఖం మీదే చెప్పేస్తుంది. అందుకే ఆమె సలహాలు ఎక్కువగా వింటాను. సోషల్ మీడియాలో నడిచే ట్రెండ్ ను ఆమె ఎక్కువగా ఫాలో అయి నాకు చెబుతూ ఉంటుంది. నా సినిమాల విషయంలో అదే నాకు బెస్ట్ అనిపిస్తుంది అంటూ చెప్పుకొచ్చాడు నాగచైతన్య. అయితే సినిమా బ్యాక్ గ్రౌండ్ ఉన్న నాగచైతన్య.. శోభిత మాట వినడం అంటే కాస్త విడ్డూరంగానే ఉందంటున్నారు ఆయన అభిమానులు. ఎంత పెద్ద హీరో అయినా భార్య మాట వినాల్సిందే అంటూ కామెంట్లు పెడుతున్నారు ఫ్యాన్స్.



# రీ ఎంట్రీపై క్లారిటీ ఇచ్చిన ఇలియానా !



వెండితెరకు 2006లో 'దేవదాసు' తో పరిచయమైన ఇలియాన, దక్షిణాది సినిమాల్లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు సంపాదించుకుంది. ప్రభాస్, పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్, మహేష్ బాబు వంటి హీరోలతో నటించి హిట్ చిత్రాలతో తన కెరీర్ గ్రాఫ్‌ను పెంచుకున్న ఈ ముద్దుగుమ్మ కాస్త అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి అక్కడ కూడా తనని తాను నిరూపించుకుంది. ఇక ఇటీవల తన తల్లిగా తన బాధ్యత ఎక్కువగా ఉండటంతో కొన్ని సంవత్సరాలుగా సినిమాలకు దూరంగా ఉంది. అయితే తాజాగా ఒక కార్యక్రమంలో ఇలియానా మాట్లాడుతూ..'నా ఇద్దరు పిల్లలను చూసుకోవడంలో బిజీగా ఉన్నప్పటికీ, నా అభిమానులను మిస్ అవుతున్న. మళ్లీ సినిమాల్లో రావడానికి త్వరపడడం లేదు. కానీ నా కెరీర్‌లోను, అభిమానుల కోసం కూడా మళ్లీ తెరపై అలరించడానికి సిద్ధంగా ఉన్నా' అని తెలిపింది. అలాగే ఇలియానా తన రిటర్న్ గురించి కూడా స్పష్టత ఇచ్చారు. "ఏ పని చేసినా దానికి పూర్తి సమర్పణతో ఉంటాను. తిరిగి నటనకు రాబోతున్నప్పుడు మానసికంగానూ, శారీరకంగానూ పూర్తిగా సిద్ధంగా ఉండాలి, అందుకే కొంత సమయం పడుతుంది" అని పేర్కొన్నారు. తెలుగు తెరపై ఆమె చివరిసారి 2018లో 'అమర్ అక్బర్ ఆంటోనీ' లో కనిపించారు. అయితే, బాలీవుడ్‌లో కూడా పలు చిత్రాల్లో నటిస్తూ తన ప్రస్థానం కొనసాగించారు. ఇప్పుడు అభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు, ఎందుకంటే తల్లి అయినా, ఇలియాన త్వరలో మళ్లీ తెరపై హైలైట్ అవ్వబోతోందని స్పష్టమైంది.